క్లుప్తంగా

ఇళ్ల పట్టాలు పంపిణీ



నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లిలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ పల్లె కంటి అరుణకుమారి మాట్లాడుతూ గ్రామంలో 320మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు వీరమాచినేని నాగమల్లేశ్వరరావు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా మంజూరుపత్రం అందజేత



జగ్గయ్యపేట అర్బన్ : ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన జగ్గయ్యపేట పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన యాదాల ప్రవీణ్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను శనివారం మృతుడి భార్య కల్యాణికి బీమా మంజూరుపత్రాన్ని అందజేశారు. బీమా మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే ఉదయభానుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మృతుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర, అగ్రహారం ఉపసర్పంచ్ శ్రీను, జంగాల వాసు, వెల్ఫేర్ సెక్రటరీ శ్యామ్ పాల్గొన్నారు.

600 మందికి వైద్యపరీక్షలు

పోచంపల్లి(జగ్గయ్యపేట):గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమేష్‌బాబు సూచించారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వైద్యులు 600మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ బూతుకూరి లక్ష్మి, ఉప సర్పంచ్ శీలం బ్రహ్మం, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వరరావు, వైద్యాధికారులు స్రవంతి, కీర్తిరెడ్డి, అనిల్‌కుమార్, కార్యదర్శి జగ్గయ్య, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పెనుగంచిప్రోలు వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు ఊట్ల నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ఊట్ల కన్‌స్ట్రక్షన్స్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విమలాభాను ప్రారంభించారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉదయభాను మాట్లాడుతూ సీఆర్డీఏ అప్రూవ్ లేఅవుట్‌తో గ్రీన్ ఎవెన్యూ కన్‌స్ట్రక్షన్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, వత్సవాయి జడ్పీటీసీలు ఊట్ల నాగమణి, యేసుపోగు దేవమణి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, పేట కౌన్సిలర్ పూసల పుల్లారావు, నాయకులు జంగాల వాసు, నారెడ్ల కిషోర్ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడులు



కంచికచర్ల : పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండి, సేంద్రీయ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని, జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ)వ్యవసాయ అధికారి సత్యవతి పేర్కొన్నారు. కంచికచర్లలో గ్రామీణ విత్తన ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎంటీయూ 1061 ఫౌండేషన్ విత్తన ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. సత్యవతి మాట్లాడుతూ విత్తన ఉత్పత్తిలో మెలకువలు పాటించాలన్నారు. వేప, తులసి, కరివేపాకు తదితర పంటల సాగు పెంచాలని సూచించారు. అనంతరం వరిలో చీడలను ఆశించే పురుగులను తొలగించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, వీఏఏలు శ్రీనివాసరావు, రఘు, నాగరాజు, మస్తాన్, అధిల్, రైతులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపురసుందరీగా అమ్మవారు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏడోరోజున జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా ఆలయాల్లో అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీలలిత త్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు మహంకాళి రామప్రశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీచండీ మూలమంత్ర సహిత రుద్రహోమం నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో లక్ష్మీగణపతి, చండీమూలమంత్రసహిత శ్రీమహాలక్ష్మి హోమాలు చేశారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణలో, అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీధనలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వగా రూ.4లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

నందిగామలో..

నందిగామ: నందిగామలోని కన్యక పరమేశ్వరి ఆలయం, మండలంలోని సత్యమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా పూజలందుకున్నారు. సుఖశామలాంబ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారు కనకదుర్గగా దర్శనమిచ్చారు. త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లు చండీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో భక్తులు పూజలు, హోమాలు చేశారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారు లలితా త్రిపురసుందరీగా భక్తులకు దర్శనమిచ్చారు. వత్సవాయిలో వత్సవాయమ్మ తల్లి ఆలయం, లింగాల ఉమామహేశ్వర, చిట్టేల శ్రీ వెంకటేశ్వర, మక్కపేట ప్రసన్నాంజనేయ, మంగొల్లు రామాలయం, భీమవరం ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిరోజు అమ్మవారికి కట్టిన వస్త్రాలను రాత్రి సమయాల్లో పూజ అయిన తరువాత వేలం నిర్వహిస్తుండగా, భక్తులు పోటీపడి వేలం ద్వారా సొంతం చేసుకుంటున్నారు.

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలకు చేరుకుని శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా కొలువుదీరారు. పట్టణంలోని జుజ్జూరు రోడ్డులో విశ్వశాంతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు అలంకరణతో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో విశేష పూజలు చేశారు. లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. గండేపల్లిలో కాటా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు, మాలాధారులు ప్రత్యేక పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శనివారం తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుమంచిపల్లిలో..


జగ్గయ్యపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు శనివారం లలితాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గౌరవరం, వేదాద్రి, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, జయంతిపురం గ్రామాల్లో మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల విగ్రహాలకు అర్చకులు శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



పేటలోని వెండిదేవాలయంలో అమ్మవారు



పేటలో శ్రీధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో



వత్సవాయమ్మ తల్లి ఆలయంలో ..



నందిగామలో చండీగా దర్శనమిస్తున్న త్రిశక్తిపీఠంలోని అమ్మవారు



అనుమంచిపల్లిలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



నందిగామలో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న సుఖశామలాంబ అమ్మవారు



నందిగామలో లలితా త్రిపుర సుందరీగా దర్శనమిస్తున్న వాసవీ అమ్మవారు

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం రాత్రి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహరావు సందర్శించారు. సరస్వతీదేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని 16వవార్డులోని కనకదుర్గమ్మ అమ్మవారిని, కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలోని వాసవీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెండోవార్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు.జి.భాస్కరం, ఓర్సు జ్వాలా, అన్నం పిచ్చయ్య,తానూరి రాము, ఆలోకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహరావు

విద్యుదాఘాతంతో కూలీ మృతి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): తెలంగాణ రాష్ట్రం రెడ్లకుంట గ్రామానికి చెందిన అమ్మనబోయిన నాగరాజు (26) తాపీ పని నిమిత్తం గ్రామంలోని ఓ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం కోసం ఉపయోగించే ఇనుప చువ్వలను డాబా పైకి తీసుకెళ్తుండగా పక్కనే ఉన్న 33 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించించారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో తండ్రీకుమార్తెల దుర్మరణం



రామచంద్రరావు, జనని మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రైలు ప్రమాదంలో కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన తండ్రీకుమార్తెలు మృతి చెందారు. గ్రామానికి చెందిన చలమాల రామచంద్రరావు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య సునీత, కుమార్తెలు ఇంటర్ చదువుతున్న జస్మిత, టెన్త్ చదువుతున్న జనని(15) ఉన్నారు. సరస్వతీదేవి పూజ కోసం బాసర వెళ్లేందుకు హైదరాబాద్‌లో గురువారం రాత్రి నలుగురూ రైలుఎక్కారు. తల్లిదండ్రులు ఒక బోగీలో, కుమార్తెలు మరో బోగీలో కూర్చున్నారు. శుక్రవారం రైలు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగగానే రామచంద్రరావు తనకుమార్తెల వద్దకు వెళ్లాడు. అందరూ ఒకే బోగీలో ఉందామంటూ తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ, చిన్న కుమార్తె జనని, రామచంద్రరావు రైలు కింద పడిపోయారు. ఈ ఘటనలో జనని అక్కడికక్కడే మృతిచెందింది. రామచంద్రరావును చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహాలను శనివారం ఉదయం గనిఆత్కూరు తీసుకురాగా, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రామచంద్రరావు, జనని మృతదేహాలకు శనివారం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల హరిజగన్నాధరావు, బండ్లమూడి చౌదరిరావు, ప్రత్తిపాటి కృష్ణమూర్తి ఉన్నారు.

పేదవాడి సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు:పేదవాడి సంతోషమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. పెనుగంచిప్రోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుతేదీల క్యాలెండర్‌ను గ్రామస్తులకు అందజేశారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2024లో ముఖ్యమంత్రిగా రెండోసారి పట్టం కడదామని పిలుపునిచ్చారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, వైఎస్సార్‌సీపీ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైస్‌ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చుంచు బెనర్జీ, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, జంగాల వాసు, కొమరగిరి భరద్వాజ్, పీఆర్ ఏఈ సుందర రామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

స్థానిక యాదవ బజారులో ఐదు కుటుంబాలకు చెందిన 20మంది టీడీపీ నుంచి అధికార వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ ఉదయభాను కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, స్థానిక నాయకులు జంగాల వాసు, వీర్ల నరసింహారావు, మునిబోయిన సైదులు, మల్లెబోయిన హనుమంతరావు, గోపయ్య, గజ్జి నరసింహారావు, మల్లెబోయిన సైదులు, సముద్రాల లక్ష్మణరావు, షేక్ మదార్, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఉదయభాను

సమసమాజ నిర్మాణమే జగనన్న ధ్యేయం

చందర్లపాడు(నందిగామ టౌన్): కుల, మత, వర్గాలులేని సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తోటరావులపాడులో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా అందిస్తున్న సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకంగా మారారని కొనియాడారు. ప్రజాసంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నెరవేర్చి చెప్పాడంటే.. చేస్తాడంతే అనేంతగా పేరు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించటంతో పాటు కష్టకాలంలో అండగా నిలిచి ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో సైతం ఘన విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, వైఎస్ఎన్ ప్రసాద్, మౌలేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



తోటరావులపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నా మట్టి-నా దేశంపై అవగాహన ర్యాలీ

నందిగామ: మండలంలోని సోమవరం గ్రామంలో శనివారం నామట్టి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించడంతోపాటు ప్రతిఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూనిట్ అధికారి సుంకర రాము, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోచంపల్లిలో..

పోచంపల్లి(జగ్గయ్యపేట): నామట్టి–నాదేశం కలశ యాత్ర కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. వన్ ఇండియా వన్ నేషన్ ప్రాధాన్యతను వివరించారు. ర్యాలీలో ఎంపీడీవో రమేష్‌బాబు, ఉప సర్పంచ్ శీలం బ్రహ్మం, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, ఏపీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శి జగ్గయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన 1991-92 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

వీరులపాడు: వీరులపాడు వాసిరెడ్డి హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. స్థానిక పాఠశాలలో 1991–92 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకొరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వట్టికొండ నరసింహారావు, గంగవరపు నరసింహారావు, రాజా, ప్రసాద్, నగేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో సమీక్ష

నందిగామ: రాష్ట్రస్థాయి సామర్థ పరీక్షలను విద్యార్థులు సమర్థవంతంగా రాసేలా ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలని డీఈవో సివి రేణుక సూచించారు. డివిజన్ పరిధిలో 912 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 262 పాఠశాలలు కేంద్ర ప్రభుత్వం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే రాష్ట్రస్థాయి సామర్థ్య పరీక్షలకు ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం పట్టణంలోని వదినేపల్లి గార్డెన్స్‌లో డివిజన్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులతో డీఈవో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రేణుక మాట్లాడుతూ నవంబర్ 3న జరగనున్న రాష్ట్రస్థాయి సామర్థ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకు సంబంధించిన ఆయా అంశాలపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. డివైఈవో వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంఈవోలు, ఎంపికైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుక

ఘనంగా బతుకమ్మ వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. స్థానిక శ్రీరంగనాయకస్వామి ఆలయంలో శనివారం జరిగిన వేడుకల్లో రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్,పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయ ప్రధానార్చకుడి మృతి

పెనుగంచిప్రోలు:స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రధానార్చకుడు మర్రెబోయిన వెంకటరమణ(58) అనారోగ్యంతో కొంత కాలంగా విజయవాడలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆయన మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, ఆలయ మాజీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, వైఎస్సార్‌సీపీ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఆలయ చైర్మన్లు, సిబ్బంది, ఆలయ అర్చకులు, వేదపండితులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.



మర్రెబోయిన వెంకటరమణ(ఫైల్)

ఊరచెరువులో మృతదేహం

జయంతి(వీరులపాడు):మండలంలోని జయంతి గ్రామ ఊరచెరువు బావిలో మృతదేహాన్ని శనివారం గుర్తించారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కథనం మేరకు..గ్రామానికి చెందిన కొందరు మహిళలు శనివారం సాయంత్రం ఊరచెరువు బావికి నీటి కోసం వెళ్లి బావిలో మృతదేహం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు జయంతి గ్రామానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి (40)గా గుర్తించారు. తాపీ పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో ఉంటూ 20 రోజులకొకసారి గ్రామానికి వచ్చిపోతుండే శ్రీనివాసరెడ్డి, కుటుంబ కలహాల నేపథ్యంలో కొన్నేళ్లుగా భార్యా, పిల్లలతో వేరుగా ఉంటున్నట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించి ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

నందిగామలో చోరీ

నందిగామ: నందిగామ పట్టణంలోని ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై పండు దొర తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని కాకతీయ అపోలో పాఠశాల సమీపంలో ఓ రిటైర్డు డీఎస్పీ నివాసం ఉంటున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఆయన, కుటుంబసభ్యులు హైదరాబాదు వెళ్లారు. రోజు మాదిరిగానే శనివారం నాడు కూడా ఇంటికి శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చింది. ఆ సమయంలో తలుపులు తెరచి ఉండడాన్ని గమనించి యజమానికి సమాచారమిచ్చారు.వెంటనే నందిగామకు వచ్చిన ఇంటి యజమాని ఇంట్లోకి వెళ్లి చూడగా దేవుడి గదిలోని పలు వెండి సామాగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని కోదాడ రోడ్‌లో బి-కన్వెన్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిగ్నేచర్ ఇండియా ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవాడగా రోజురోజుకు పెరిగిపోతున్న జగ్గయ్యపేట పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ఇలాంటివి ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏర్పాటుచేసిన జ్యువెలరీ, దుస్తులు, లైఫ్‌స్టైల్ స్టాళ్లను ఎమ్మెల్యే ఉదయభాను, విమలాభాను దంపతులు సందర్శించారు. ఎగ్జిబిషన్ ఆర్గనైజర్లు రూపా రేఖ, సుభాష్ పాల్గొన్నారు.